
# నా రైలు ప్రయాణాలు




కాశీభట్ల కృష్ణారావు
(నవ్య సాహిత్యమండలి)

— ౦ —

"ఎందుకోయ్! ఏడున్నరకొచ్చే ప్యాసింజరుకు 6 గంటలకే తీసుకొచ్చేశేవు? కాని, నీకు ప్రయాణమంటే యింక లేదాశ. ఇంట్లో అందర్నీ పరుగెత్తించి చంపే స్తావు?"

"ముందొచ్చేసి ఉంటే మంచిదేగా! దానికోసం కనిపెట్టుకు మనం ఉండాలిగాని మనకోసం అది నిరీక్షించుకుని ఉండదు గదా?"

"అయితే దానికోసం కనిపెట్టుకుని నువ్వు కూర్చో? నేను బజారుదాకా వెళ్ళొస్తా."

"మంచివాడివే! ఉండవోయ్, టిక్కెట్లు యింకిస్తారు. ఈ స్టేషన్‌లో టిక్కెట్ల కిటికీదగ్గర త్రోపులాట, దొంగతనాలు, అవమానాలు, నీ కింకా తెలియదు కాబోలు. నాకాలు కీకట్లు ఎందుకొచ్చే యనుకున్నావ్? ఒకమారు విశాఖపట్నం వెళ్ళడానికి బయల్దేరి టిక్కెట్లు కొనడం సందర్భంలో ఆసుపత్రికి వెళ్ళాల్సొచ్చింది.. ."

"అయితే ఆవూసు యిప్పుడెందుకు? ఈవాళ టిక్కెట్లు నేను కొంటాలే."

"అదలాగా తప్పదు. అందుకే బజారు కెళ్ళొద్దంటున్నా."

మే మిలా మాటలాడుకుని థర్డుక్లాసు ప్యాసింజరు హాల్లో పడేసి ఉన్న విరిగిపోయిన బెంచీమీద సర్దుకున్నాం, కాస్త ఇరుగ్గా ఉన్నా. ఏదో మా బావ అనబోతున్నాడు. ఇంతలో గంట మ్రోగింది. వెంటనే అల గాడికి ఒక్కటే తొందర. "వెళ్ళవోయ్. వెళ్ళవోయ్" అన్నాడు. "ఎందుకోయ్, ఇంకా టిక్కెట్లు యివ్వరు. ఇది గుడ్సు బెల్లు" అన్నాను.

"ఈ రైళ్లు ఒక్కొక్కప్పుడు ఆలస్యమౌతాయి. ఇవాళ ముందైందేమో అనుకున్నాను" అన్నాడాయన. "ముందెప్పుడూ కావోయ్. అయితే ఆలస్యమే కాని" అన్నాను.

ఇలా ఏవో మాటలాడుకుంటూ ఉండేసరికి ఓగంట అయింది. ఇంతలో ప్యాసింజరుకు బెల్లూ అయింది. కిటికీదగ్గర టిక్కెట్లకోసం క్రిక్కిరిసి చస్తున్నారు. అదంతా చూచి రెండవ ప్రక్కనుంచి తిరిగి లోపలకు వెళ్లి నెల్లూరుకు రెండు టిక్కెట్లు ఇవ్వండన్నా. ఆయన డబ్బు లెక్క చూసుకుని ఏ క్లాసనకుండానే తేదీ కొట్టి ఇంటరు టిక్కెట్లు రెండు పారేశేడు ఎవరో జంటిల్ మేనను కొని.

మా బావ ఆశ్చర్యపోయె డాపనికి. ఆశ్చర్యం కాదూ? రెండు సెల్లయి నా కాలిమీది దెబ్బ మాననేలేదు. అ

లాంటి విషయంలో ఆయాసపడకుండా అనకాపల్లిలో టిక్కెట్లుకొనడం ఆశ్చర్యంగానే ఉన్నా దతని మట్టుకి.

ఇంతలో రైలు వచ్చి నిల్చింది. ఎక్కే దిగే వాళ్లయొక్క అమర్దా విపరీతంగానే ఉంది. లైసెన్సు కూలీలతో లావాదేవీలు జాస్తీగానే ఉన్నాయి. ఎలాగో చచ్చి చెడి మేంగూడా దాంట్లో పడ్డాం. కదిలీ ముందు రైలు కూసింది. "నువ్వరిచినా నిన్ను వదలరు పద" అన్నాడు తన యుక్తికి తానే మెచ్చుకుంటూన్న మొగంతో మా బావ. "చాల్లేవోయ్ తాతయ్యా! నీ ప్రసంగం ఎవరైనా వింటే నవ్వి పోగలరు. ఊరుకో" అన్నాను. రైలు మనోవేగంతో నిప్పులు రువ్వుకుంటూ పోతోంది. శారదావంతెన దాటేసరికి సర్దుకుని నిమ్మితంగా కూర్చున్నాం, ఇంటర్ క్లాసవడంచేతను, ఆనాడు జనం తక్కువవడంచేతను. స్టేషనులదగ్గర ఆగుతూ మళ్లా బయల్దేరి పోతోంది.

౨

"సరి అయిందీ! ఎందుకోయ్ కిటికీలోనుంచి చిన్నపిల్లాడిలా అలా పైకి చూడ్డం?"

"సరి దానికేం గాని కంట్లో ఊదు."

"ఈ రాక్షసి బొగ్గునలక లిలా పోవు. ఇంజన్ దగ్గరకు వెళ్లు నీళ్లు దొరుకుతాయి."

"ఓస్ బ్రహ్మాండం, అదేమిటోయ్, నీకన్నిటికీ వెటకారమే! కాస్త . . ."

"రైలు కూస్తోంది. ఉండు, ఇదే స్టేషన్? తునే?"

"అవును" అన్నాడు మరోకాయన. మేమిలా అనుకునే సరికి రైలు ఆగింది. మా రత్నానికి మొగలి పువ్వులంటే ఎంతో సరదా. అందుకని మొగలిపువ్వు లమ్మేవాడికోసం నేను చూస్తున్నాను కిటికీలోనుంచి తల పైకి తెచ్చి.

ఇంతలో ఎవరో ఒక అమ్మాయి, "ఈ సూటుకేసు ఇలా అందుకోండి, ఒక్కమారు" అన్నది. తలుపు తెరిచి అడ్డుగా నుంచున్న మా బావని చూచి అనడమే తడవుగా పెట్టి అందుకుంటూ ఆమెకు స్వాగతమిచ్చేడు. లోపలికి వచ్చేక నేనూ చూచా నామెను. బాగానే ఉంది. చూడ్డానికి వ్రేలాడుతూన్న పొళ్ల లోలక్కులు, చెరిసగం చెవులు మూసేసీలా వదులు గా అల్లబడిన వాలు జడ, కాళ్లకు కల్కటూ లేడీ స్లిప్పర్లు, కళ్లకు రోల్డుగోల్డు కళ్లద్దాలు, పాదాలమీదికి పడుతూ మల్లిమొగ్గల పట్టీలు, మెళ్లో పుడకలగొలుసు, ముఖాన్ని బొట్టు కనబడకున్నా పునిస్త్రీతేజస్సు, ఎఱ్ఱని పెదిమెలమీద మందహాసం, రేషన్—కబ్బా—సేలంచీర—ధరించి, ఆ పచ్చి జవ్వని బెంచీలమధ్య నుంచుంది.


మా బావ ఆమెకు స్వాగతమిచ్చి "రావమ్మా! కూచో" అంటూ అటిటూ జరుగుతున్నాడు. "నువ్వే ఇటురా" అని నే నన్నాను. ఆ పిల్ల అతన్ని తగిలీ తగలడంగా కూచుంది చోటు లేక. ఆడాళ్లు కూచునిపెట్టి ఆవలుండే అన్నా నామెతో మాటవసరకి. "ఉంటే నేం, అందులోనూ జాగాలేదు. ఎక్కడైతే నేం!" అన్న దామె నవ్వుమొగంతో నాకేసి చూస్తూ.

ఇంతలో నలుగురు కూలీలతో బంట్రోతునిగూడా వెంటేసుకుని, రైలంతా నాలుగుమార్లు లనిఖీచేసి ఎక్కడా జాగాలేక మా పెట్టిలోనే పడ్డాడు మరోకాయన, సామాను నందుకోవడం కష్టంగానే ఉం దతగాడికి

మా బావ లేచి అనాహూయంగానే సిద్ధపడ్డాడా పరోపకారానికి. ఏమయితే నేం, సామానంతా లోపల పడింది. ఆయన మా బావకేసి చూస్తూ "మీ దయవల్ల సామానంతా లోపలికొచ్చింది" అన్నాడు మా బావ బ్రహ్మానందం అనుభవిస్తున్నాడు, దేవేంద్రుడు కోరిన నలచక్రవర్తిలా ప్రాణాలయినా యిలాంటి వాళ్ల కిచ్చెయ్యాలిరా—అనుకుంటూ తనలోనే.

రైలు నడుస్తోంది. అన్నవరం స్టేషనులో మా పెట్టిలో వాళ్లు చాలామంది దిగేశారు. పెట్టిలో ఖాళీ కాగానే ఆయన సరిగ్గా సర్దుకున్నాడు. ఇంతలో మా బావ "ఇందాకా అందించేటప్పుడు గ్రామఫోనన్నారే? ఏదీ ఒక్కమారు తీసి పాడించండి సరదాగా ఉంది" అన్నాడు సామాను నందుకున్నందుకు ప్రత్యుపకారం అర్థించినట్లు మొగంపెట్టి

ఆయన తియ్యాం డమగో అన్నాడు. ఫోను దించేసరికి, ఆ అమ్మాయి నవ్వుతూ చక్కా వచ్చి సౌండు బాక్సు తగిలించి, ముల్లు బిగించి, "ప్లేట్లు తెండి" అన్నది మాకేసి చూచి. ఆయనకూడా తనకు కొంత శ్రమ తగ్గుతుందనే అభిప్రాయంతోనో, స్త్రీ గౌరవం నిలబెట్టే బుద్ధి గలిగియో ఊరుకున్నాడు ప్లేట్ల పెట్టి చూపించి. మాబావ ప్లేట్లు తీసి అందిస్తూంటే ఆ పిల్ల పాడిస్తోంది.



వాళ్లిద్దరికీ గంటలన్నీ నిముషాల్లా తోచుతున్నాయి. కొంత సేపటికి, “నేను ఏలూరులో దిగేస్తానండి, ఇంక ఫోను కట్టెయ్యండి” అన్నాడు. ఇష్టం లేకపోయినా ఎలాగో ఆపని మానేశారు.

రైలు ఏలూరు స్టేషన్‌లో ఆగింది. ఆపిల్ల లేచి సూటుకేసు పట్టుకు వెళతానన్నట్టుగా కళ్లతో నే వందనాలు చెప్పి మమ్మల్ని రాసుకుంటూ రైలుదిగి చక్కా వెళ్ళిపోతోంది మా బావ సామాన్లందిస్తున్నాడు. ఆయన దిగి అందుకున్నాడు. ఇంతలో ఆ అమ్మాయిని టిక్కెట్టు కలెక్టరు టిక్కెట్టడిగేడు. మందహాసంతో రైల్లోంచి సామా నందుకోలేక వస్తూ ఉండే ఈ వ్యక్తిని చూపించి ఒయ్యారంగా గేటు దాటి చక్కా పోయిం దావలికి సరే? ఆయనదగ్గర టిక్కెట్టుంది కాబోలనీ, ఆ పెట్టె కేషు పెట్టె అనీ, ఆ అమ్మాయి హాల్లో నుంచుంటుందనీ, అనుకుని ఊరుకున్నా డతడు

## 3

“సామానులన్నీ దిగేయా అండి?” అన్నాడు మా బావ. “మీ దయవల్ల” అంటూ ఆయన సరిగా చూచుకుని మాకు వందనాలు చెప్పి, లైసెన్సు కూలీలతో చాలా ఘర్షణపడి, ఆఖరికి ఆ సామాను గేటు దాటించడానికి అర్ధరూపాయికి నిర్ణయించుకొని సామాను పట్టించుకొని గేటుదగ్గరకు పోయేడు మా బావ ఏదో అనబోతూంటే మాటాడకన్నట్లు కళ్లతోటే మందలించేను. ఆయనకూడా ఊరుకున్నాడు.

“టిక్కెట్లు తెండి” అన్నాడు, గేటుదగ్గర నుంచున్న టిక్కెట్టు కలెక్టరు టిక్కెట్టు సామాను చీటి అందిచ్చే డాయన

“రెండో టిక్కెట్టు”

“ఇదేమిటండీ మనిషికి రెండు టిక్కెట్లెందుకూ? నేను డబిల్ పన్నా మనిషినైనా బస్సుల్లోను, ఆఖరికి సినిమాలోకూడా ఒక టిక్కెట్టేగాని రెండు టిక్కెట్లు ఎన్నడూ ఇవ్వలేదు”

“ఏమిటయ్యా! అలా వాగుతావ్ మాటలన్నీ నీకేగాని మరెవళ్లకీ రావనుకున్నావా? ఏమిటి తే!”

“లేనిదే.”

“అయితే సామానలా ఉంచు.”



"ఇదేమిటండీ! ఒక మనిషికి రెండు టిక్కెట్లేమిటండీ?"

"ఏం వేళాకోళంగా ఉందా ఏమిటి? ఈ టిక్కెట్టు నీ భార్యది. నీ దేదీ?"

"నా భార్య ఎవరు?"

"ఇప్పుడేగా గేటునుండి అవలికి పోతూ టిక్కెట్టడిగితే నిన్ను చూపించింది. ఆవలుండు, ఎక్సెస్ చెయ్యాలి"

"నా భార్యను నేను తీసుకురానిదే?"

"అయితే నీసాని గాబోలు."

"నాకు సానెందుకు?"

"నాకా గొడవంతా ఎందుకు? ఆవలుండు ఎక్సెస్ చేస్తాను."

ఈ గొడవంతా వినబడి స్టేషన్‌మాస్టరక్కడకు వెళ్తున్నాడు. ఇంతలో ఇంజన్ నీళ్లు త్రాగి మళ్లా వచ్చి మమ్మల్ని లాక్కుపోయింది. ఆ అమ్మాయి మాత్రం మళ్లా మా కంట బడలేదు.




అందమైన ఫౌంటెన్‌కలాలు

"రత్నా యింప్రూవ్డ్"

వీనితో వ్రాస్తే ముత్యాలవంటి అక్షరాలు కుదుర్తాయి. ఇవి చాలాకాలం పనిచేస్తాయి.

నిప్పుకి మండవు, విరిగిపోవు; తళతళ లాడ్తుంటాయి. మంచి అందమైన బంగారు పాళీలు. వాని చివర 25-వ సంవత్సరములవఱకు పనిచేసే యిరిడియమ్ పొదగబడింది.

రకరకాల రంగులతో, రోల్డుగోల్డు క్లిప్పులతో ముద్దులు మూటగట్టు నీకలాల వెల సరసం.

కావలెనంటే మీమీ పేర్లు కలాలపైన ఉచితంగానే చెక్కుతాం. కావాలి మీ అందఱి ప్రోత్సాహం.

కె. రత్నా అండ్ కో.,
విద్యార్థులకు ప్రియమైన షాపు.

305, ఎస్ప్లనేడ్ రోడ్,
మద్రాసు.